RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | శనితవారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 212 | జులై 19, 2025 | వెల : రూ.3-00



## బాసర అమ్మవారిని దర్శించుకున్న మంత్రి

**వేద న్యూస్, నిర్మల్:**

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని దర్శించుకున్నారు. శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారి.. మిగతా 4వ పేజీలో..



# రూల్స్.. జాన్తా నై..!

- బైక్ లతో..రయ్..రయ్
- ప్రమాద కారకులుగా మైనర్స్
- లైసెన్స్ లేకుండానే రోడ్లపై యువత
- ఓవర్ స్పీడ్..అవగాహన రాహిత్యంతో యాక్సిడెంట్స్

**వేద న్యూస్, ఫోకస్ టీమ్:**

లైసెన్స్ లేకపోయినా మైనర్లు బైకులపై చక్కర్లు కొడుతు రయ్.. రయ్మంటూ దూసుకెళ్తున్నారు. వాహనాలను వేగంగా నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతు న్నారు. ఇలాంటి ఘటనల్లో లైసెన్స్ లేకుండా వాహనంతో రోడ్లపైకి వచ్చే మైనర్లది ఎంత తప్పు ఉందో..వారికి వాహనం ఇచ్చిన తల్లిదండ్రులు, యజమానిది తప్పే అంటూ సుప్రీంకోర్టు పలుమార్లు స్పష్టం చేసింది. అయినప్పటికీ ఇటు మైనర్ల తీరు మారలేదు..అటు తల్లిదండ్రులు లోను మార్పు కనిపించడం లేదు. పిల్లలు అడగడమే ఆలస్యం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లేకపోయినా, లైసెన్స్ పొందే వయస్సు రాకపోయినా బైకులు కొనిస్తూ..వారి జీవితాలను ఇబ్బందుల్లోకి నెట్టే స్తున్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా గట్టిగా చెప్పాలి అంటే అసలు తెలుసుకోకుండానే రోడ్లపైకి నిబంధనలకు విరుద్ధంగా తమ ఇష్టానురీతిలో దూసుకెళ్తున్నారు. రాత్రిపూట రోడ్లపై పోకిరీలు విన్యాసాలు చేస్తున్నారు. అతివేగంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాల బారిన పడుతూ, ఎదుటివారికి ప్రాణ నష్టం కలిగేలా చేస్తున్నారు.

**మైనర్ల వల్లే మెజారిటీ ప్రమాదాలు**

ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలు పరిశీలిస్తే.. ప్రమాదాలకు ఎక్కువ శాతం మైనర్లు కారణంగా అని తెలుస్తోంది. మైనర్లు అవగాహన లేకుండా రోడ్లపై వాహనాలు నడపడం వల్లే నిబంధనలన్నీ పాటిస్తూ.. డ్రైవింగ్ చేస్తున్నవారూ ప్రమాదాల బారిన పడి..చేయని తప్పునకు శిక్ష అనుభవిస్తున్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చిన తల్లితండ్రులపై కేసులు నమోదు చేస్తున్నా.. ఫలితం లేకుండా పోతున్నది. తమ పిల్లాడు బాగా వాహనం నడుపుతున్నాడని సంతోషంలో తల్లిదండ్రులు వారిని మరింత చైతన్య పరుస్తున్నట్లు తెలుస్తున్నది. ఫలితంగా ఎంతో మంది ప్రాణాలు కోల్పోవడానికి కారకులుగా అవుతున్నారు.

**ఉల్లం "ఘనుల్లో" వారే అధికం**

ట్రాఫిక్ ఉల్లంఘనలను మూడు కేటగిరీలుగా విభజిస్తారు. వాహనం నడిపే వ్యక్తికి ముప్పు కలిగించేవి. ఎదుటి వారికి మప్పుగా మారేవి. వాహన చోదకుడితో పాటు ఎదుటి వ్యక్తికి ముప్పు తెచ్చి పెట్టేవి. ఇందులో మైనర్ డ్రైవింగ్ మూడో కేటగిరీలోకి వస్తుంది. ద్వి చక్ర వాహనుల కారణంగానే ఎక్కువగా జరుగుతున్నట్లు తేలింది. ఆ తర్వాత స్థానంలో తేలికపాటి వాహనాలుగా పిలిచే కార్లు ఉంటున్నాయి. ద్విచక్ర వాహనాల ద్వారా జరిగే ప్రమాదంలో వాహన చోదకుడితో పాటు పాదచారులు ఎక్కువగా మృత్యువాత పడుతున్నారు.

**రేసింగ్లతో యమడేంజర్**

చాలా ప్రైవేట్ విద్యాసంస్థలు సిటీ శివారు ప్రాంతాల్లో ఉంటున్నాయి. యువత కాలేజీలకు ద్విచక్ర వాహనాలలో వస్తుంటారు. వారాంతపు సెలవుల లో చాలామంది బైక్ రేసింగ్ లో పాల్గొంటూ.. ప్రమాదాల బారిన పడుతున్నారు. బైక్లలో వెళ్తూ..సెల్ఫీలు తీసుకోవడం కారణంగాను ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అదేవిధంగా కాలేజీలకు వెళ్లే సమయంలో ఒక్కో వాహనంలో ముగ్గురు చొప్పున అధిక వేగంతో వెళ్లడం కారణంగాను ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పుకోవచ్చు.

**రోడ్లపై వాహనాలతో చక్కర్లు**

వాహనాలపై మోజుతో తెలిసి తెలియని వయసులో.. మైనర్లు రోడ్లపై వాహనాలతో చక్కర్లు కొడుతున్నారు. ఈ వాహనాలను స్పీడ్ గా నడుపుతూ..రోడ్డు ప్రమాదాల బారిన పడిన ఘటనలు కూడా ఉన్నాయి. గతంలో ఓ మైనర్ బాలుడు కుటుంబ సభ్యులకు సంబంధించిన ద్విచక్ర వాహనం తీసుకొని వేగంగా దూసుకుపోయాడు. వచ్చిరాని డ్రైవింగ్ తో మరో వాహనాన్ని ఢీకొట్టాడు. ప్రమాదంలో బాలుడితో పాటు మరో బైక్ పై ఉన్న వ్యక్తికి గాయాలయ్యాయి. ఇలాంటి ఘటనలు పలుమార్లు చోటుచేసుకున్నాయి.

**ఇవీ నిబంధనలు**

భారత మోటార్ వాహనాల చట్టం ప్రకారం.. 16 ఏళ్ల లోపు వయసు కలిగిన వారు వాహనాలు నడపకూడదు. అది నేరం కూడా. 16 నుంచి 18 ఏళ్ల మధ్య వయసు ఉన్న వారు గేర్లు లేని వాహనాలు నడపవచ్చు. 18 ఏళ్లు నుండి డ్రైవింగ్ నేర్చుకున్నాక రవాణా శాఖధికారుల ద్వారా తప్పనిసరిగా లైసెన్సులు పొందాలి. మైనర్లు వాహనాలు నడపడం చట్ట విరుద్ధం. వారికి వాహనం ఇచ్చిన వారిపై కూడా కేసు నమోదు అవుతుంది.




# ప్రజల ప్రాణాలతో చెలగాటం..!

**వేద న్యూస్, కరీంనగర్ :**

కరీంనగర్ జిల్లా కేంద్రంలో గల కిషాన్ నగర్ లోని ప్రియా డైరీ ప్రియా మిల్క్ కంపెనీ పార్లర్ లో కాలం చెల్లిన పాలు,పెరుగు, బట్టర్ మిల్క్ అమ్ముతూ, సామాన్య ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. శుక్రవారం ఓ వ్యక్తి పాల ప్యాకెట్ కొనగా అది కాలం చెల్లిందిగా గమనించాడు.. ఇదేంటని ప్రశ్నించగా మేము ఇలాగే అమ్ముతాము ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి.! అంటూ, బెదిరింపులకు గురి చేస్తున్నారని వినియోగదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిన్నచిన్న కంపెనీలు చిరు వ్యాపారస్తులపై తక్షణమే స్పందించే అధికారులు ఇలాంటి బడ వ్యాపారుల ఆగడాలను ఎందుకు ఆట కట్టించడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు.

అధికారుల, నాయకుల అండదండలతో ఇలా దౌర్జన్యంగా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ప్రియా డైరీ యజమాన్యంపై సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి తక్షణమే వీరిపై శాఖపర చర్యలు తీసుకోని ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసి ప్రజల ఆరోగ్యాలను కాపాడవలసిందిగా నగర ప్రజలు వినియోగదారులు కోరుతున్నారు.



# కాకతీయ జూపార్క్కి తెల్ల పులి

**వేద న్యూస్, హన్మకొండ :**

హన్మకొండలోని కాకతీయ జూలాజికల్ పార్క్లో నిర్మించిన టైగర్ ఎన్క్లోజర్లో, నెహ్రూ జూలాజికల్ పార్క్ హైదరాబాద్ నుండి తీసుకువచ్చిన తెల్లపులిని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా ప్రజల సందర్శనార్థం ఎంక్లోజర్లోకి విడుదల చేశారు. అలాగే జూలోని జంతువుల సమాచారం తెలుసుకొనుటకు ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్స్, చాట్ బాట్, వన మహోత్సవం కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కొండా సురేఖ మాట్లాడుతూ జూలోని జంతువులను దత్తత తీసుకోవడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని అన్నారు. జూపార్కును మరింత అభివృద్ధి చేయడానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అనుజ్ అగర్వాల్, జిల్లా అటవీ శాఖాదికారి, వరంగల్ ఐ/సి హనుమకొండ, జనగాం కె.కృష్ణమాచారి, జిల్లా అటవీ శాఖాదికారి, ఫ్లయింగ్ స్క్వాడ్ డివిజన్, భద్రాద్రి సర్కిల్, జూ పార్క్ రేంజ్ ఆఫీసర్ బి మయూరి, ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ సభ్యులు, అటవీ శాఖ సిబ్బంది మరియు జూపార్క్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ శాఖలో విషాదం

- డీఎస్పీ మహేష్ గుండెపోటుతో మృతి

**వేద న్యూస్, హుజురాబాద్ :**



కరీంనగర్ పోలీస్ శాఖలో విషాదం చోటుచేసుకుంది. పోలీస్ ట్రైనింగ్ సెంటర్ డీఎస్పీ మహేష్ గుండెపోటుతో మృతి చెందారు. హుజురాబాద్ ఏసిపి మాధవి భర్త ట్రైనింగ్ సెంటర్ డిఎస్పీ మహేష్ కరీంనగర్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్ లో డిఎస్పీగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన సతీమణి మాధవి హుజురాబాద్ లో ఏసిపిగా పని చేస్తున్నారు. ఆదర్శ దంపతులుగా ఉన్న ఆ కుటుంబంలో హాట్ స్ట్రోక్ విషాదాన్ని నింపింది. హుజురాబాద్ లో తన భార్య ఏసిపి మాధవి వద్దకు వెళ్ళిన మహేష్ బాబు ఒక్కసారిగా గుండెపోటుకు గురి కావడంతో వెంటనే హుజరాబాద్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ప్రాణాలు కోల్పోవడంతో ఏసిపి మాధవి తో పాటు పోలీస్ కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఎస్సై నుంచి ఇద్దరు ఒకేసారి సిఐగా డీఎస్పీగా ప్రమోషన్ పొంది పలుచోట్ల పనిచేసి ఫ్రెండ్లీ పోలీసుగా పలువురి మన్ననలు అందుకున్నారు. డీఎస్పీ మహేష్ బాబు మృతితో సిపి గౌస్ ఆలం తో పాటు పలువురు పోలీసు అధికారులు దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ ఆయన కుటుంబానికి ప్రగాడ సంతాపం సానుభూతి తెలిపారు. ఏసిపి మాధవిని ఓదార్చారు.

# కాసింపల్లిలో నీటి కష్టాలు..!

- మిషన్ భగీరథ నీళ్లు రాక తీవ్ర ఇబ్బందులు
- సుమారుగా 10 కుటుంబాలకు నీళ్ల కరువు
- మంచినీళ్లు సరఫరా చేయాలని వేడుకోలు



**వేద న్యూస్, కమలాపూర్ :**

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని కాసింపల్లిలో సుమారుగా 10 కుటుంబాలకు మిషన్ భగీరథ నీళ్ళు రాక ఆ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇరుగు పొరుగు వారి ఇంటి నల్లా వద్దకు వెళ్లి నీళ్లు మోసుకుంటూ వచ్చి వారి అవసరాలు తీర్చుకుంటున్నారు. స్థానిక మాజీ ప్రజాప్రతి నిధులకు, సంబంధిత సిబ్బందికి ఎన్నిసార్లు విన్నవించిన అధికారులతో మాట్లాడి అప్పుడు చేపిస్తాం ఇప్పుడు చేపిస్తాం అంటూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపించారు. సమస్య గురించి చెప్పినప్పుడల్లా దాటవేసే ధోరణితో వ్యవహరించారని, కానీ సమస్యను మాత్రం పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిరోజు కూలి పని చేసుకుని జీవనం కొనసాగించే ఓ మహిళ అయితే మాత్రం మిషన్ భగీరథ నీళ్లు రాక ప్రతిరోజు ఇరుగుపొరుగు వారి నల్లా వద్దకు వెళ్లి బిందెలతో నీళ్లు మోసుకుంటూ తమ గోళాన్ని నింపుకొని అవసరాలను తీర్చుకుంటున్నారు. గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన మిషన్ భగీరథ పథకం ప్రతి ఇంటికి మంచినీళ్లు సరఫరా చేయాలనే సదుద్దేశంతో చేపట్టిన కొన్ని కుటుంబాలకు మాత్రం మిషన్ భగీరథ నీళ్లు అందడం లేదు. అధికారులు స్పందించి తమ నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని బాధిత కుటుంబాలు కోరుతున్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే గ్రామపంచాయతీ సిబ్బంది ఇలాంటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి ప్రజల కష్టాలను తీర్చాల్సిన బాధ్యత వారిపై ఉంటుంది. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది ఇలాంటి సమస్యలను పై అధికారులకు చేరవేస్తున్నారా? లేక చేరవేసిన కూడా అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారా? అనేది అర్థం కాని పరిస్థితి. ఏది ఏమైనా ప్రజల నీటి కష్టాలను తీర్చాల్సిన అవసరం ప్రజా ప్రతినిధులు, అధికారులపై ఎంతైనా ఉంది.

# ఇందిరా మహిళా శక్తితో మహిళలకు ఆర్థిక ప్రగతి



- డీఆర్డీఓ శేషాద్రి

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల :**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరా మహిళా శక్తి పథకంతో మహిళలు ఆర్థికంగా ప్రగతి సాధిస్తున్నారని డీఆర్డీఓ శేషాద్రి తెలిపారు. ఇందిరా మహిళా శక్తి సంబురాలు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం నిర్వహించగా, సిరిసిల్ల నియోజకవర్గం పరిధి లోని మార్కెట్ కమిటీ చైర్ పర్సన్లు, జిల్లా సమాఖ్య, ఆయా మండలాల సమాఖ్య బాధ్యులు, వీఓలు హాజరయ్యారు.ముందుగా వివిధ మహిళా సంఘాల వీఓల విజయాలను, తమ సంఘం ప్రగతిని వివరించారు.ఈ సందర్భంగా డీఆర్డీఓ శేషాద్రి మాట్లాడారు. మహిళల ఆర్థిక ప్రగతి కోసం ప్రజా ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకాన్ని అమలు చేస్తుందని వివరించారు.రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ఆర్టీసీ బస్సులు, సోలార్ ప్లాంట్లు,క్యాంటీన్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, పెరటి కోళ్ల పెంపకం, డెయిరీ యూనిట్, పిండి గిర్నీ, మూడు సీహెచ్ సీలు, స్కూల్ యూనిఫామ్ ఇతర స్వయం ఉపాధి పథకాలకు ఆర్థికంగా భరోసా అందిస్తుందని వెల్లడించారు.సిరిసిల్ల నియోజకవర్గం పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి.. ధాన్యం సేకరించగా రూ. 1 కోటి 6 లక్షలు కమిషన్ వచ్చిందని తెలిపారు. 46037 మంది విద్యార్థులకు స్కూలు యూనిఫామ్ లు కుట్టిస్తే రూ. 48 లక్షల ఛార్జీలు చెల్లించామని వెల్లడించారు. నియోజకవర్గం లోని 4250 సంఘాలు రుణాలు సకాలంలో చెల్లించడంతో రూ. 5 కోట్ల 90 లక్షల వడ్డీ రాష్ట్ర ప్రభుత్వం తిరిగి చెల్లించిందని వెల్లడించారు.రుణాలు చెల్లించడంలో జిల్లా రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచిందని తెలిపారు.ఇల్లంతకుంట మండల ఆదర్శ మహిళా సమాఖ్య ఉత్తమ సేవలతో జాతీయ పతకానికి ఎంపిక అయిందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్లు స్వరూపారెడ్డి,సబేరా బేగంకొమిరిశెట్టి విజయరాణి, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్య, అడిషనల్ డీఆర్డీఓ సీ హెచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



### ఆలయ రహదారి విస్తరణ

# పనులను పరిశీలన

**వేద న్యూస్, వేములవాడ :**

వేములవాడ పట్టణంలోని రహదారి విస్తరణ పనులను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శుక్రవారం ఉదయం పరిశీలించారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ రహదారి విస్తరణ లో బాగంగా గుడి సమీపంలోని రోడ్డు వెంట ఉన్న పలు నిర్మాణాలను అధికారులు శుక్రవారం ఉదయం కూల్చి వేయిస్తుండగా,కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పరిశీలించి, అధికారులకు పలు సూచనలు,ఆదేశాలు జారీ చేశారు.రోడ్డు విస్తరణలో భాగంగా కూల్చివేత పనులు చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ఆర్డీవో రాధాబాయి, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, తహసీల్దార్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### చేనేత సహకార సంఘం

# ఎన్నికల నిర్వహించాలి

**వేద న్యూస్,శాయంపేట:**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు చేనేత సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించాలని అఖిలభారత పద్మశాలి సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి బాసాని బాలకృష్ణ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో కార్మికులకు న్యాయం జరగడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడు సంవత్సరాలుగా ఇన్చార్జిల పాలనలో చేనేత సహకార సంఘాలు నడవడం జరుగుతుందని గత ప్రభుత్వం చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు పెట్టిన పాపాన పోలేదని వాపోయారు. ఇప్పటికైనా తెలంగాణలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి చేనేత సంఘాల బలోపేతానికి సీఎం రేవంత్ రెడ్డి కృషి చేయాలని ఆయన కోరారు.

# నకిలీ ఎలక్ట్రికల్ గృహోపకరణాలు విక్రయిస్తున్న ముఠా అరెస్టు







**వేద న్యూస్, వరంగల్ క్రైమ్ :**

వరంగల్, హన్మకొండ, కేయూసీ పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రముఖ కంపెనీ బ్రాండ్లల్కెన పాలీకాబ్, వి.గార్డ్, గోల్డ్‌మెడల్, ఫీనోలెక్స్, చార్‌భుజా, యాంఖర్, లీగ్రాండ్ కంపెనీలకు సంబందించిన నకిలీ ఎలక్ట్రికల్ గృహోపకరణాలు విక్రయిస్తున్న అరుగురు వ్యక్తులను వరంగల్ టాస్క్‌ఫోర్స్ మట్టెవాడ,కేయూసి,హన్మకొండ పోలీసులు సంయుక్తంగా కలిసి అరెస్టు చేశారు. అరెస్టు చేసిన నిందితుల నుండి సుమారు రూ.32 లక్షల విలువ గల నకిలీ ఎలక్ట్రికల్ గృహోపకరణాలు (కరెంటు వైర్లు, స్విచ్ బోర్డులు), ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ అరెస్టుకు సంబంధించి సెంట్రల్ జోన్ డిసిపి షేక్ సలీమా వివరాలను వెల్లడించారు. వరంగల్ ట్రై సిటి పరిధిలో నకలీ ఎలక్ట్రికల్స్ వస్తువులను విక్రయించేందుకుగా నగరానికి ముగ్గురు వ్యక్తులు వచ్చినట్లుగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ విభాగానికి అందిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీస్ స్టేషన్ పోలీసుల అధ్వర్యంలో వరంగల్ జె.పి.యన్, రోడ్‌లోని మహెంద్ర ఎంటర్‌ప్రైజెసన్, హన్మకొండలోని హనుమాన్ నగర్‌లోని శ్రీఆర్‌బుదా ఎలక్ట్రికల్స్, సానిటరీ, కేయూసి పరిధిలో కెయూ రోడ్డులోని సాయి గణేష్ ఎలక్ట్రికల్స్ షాపుల్లో ఒకే సమయంలో పోలీసులు దాడులు నిర్వహించారు. ప్రజలను మోసం చేస్తూ నాణ్యత లేని ప్రముఖ కంపెనీ బ్రాండ్ల పేర్లతో నకిలీ ఎలక్ట్రికల్స్ వస్తువుల్కెన కరెంటు వైర్లు, స్విచ్ బోర్డులను విక్రయిస్తున్నట్లుగా పోలీసులు గుర్తించడం జరిగింది. దీనితో పోలీసులు దాడులు నిర్వహించిన మూడు షాపుల నుండి పెద్ద మొత్తంలో నకిలీ ఎలక్ట్రికల్స్ గృహోపకరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో మహెంద్ర ఎంటర్‌ప్రైజెస్‌లో సూమారు రూ.10లక్షల 37వేలు, శ్రీఆర్‌బుదా ఎలక్ట్రికల్స్, సానిటరీ దుకాణంలో రూ.44 వేలు, సాయి గణేష్ ఎలక్ట్రికల్స్ దుకాణంలో సుమారుగా రూ.20 లక్షల 70 వేల విలువగల నకిలీ ఎలక్ట్రికల్ గృహోపకరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మూడు దుకాణాలకు చెందిన యజమానులతో పాటు, నకిలీ సామాను విక్రయించేందుకు వచ్చిన నిందితుల్లో కేయూసి పరిధిలో ఇద్దరు, మట్టెవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకరిని అరెస్టు చేయడం జరిగిందని, పోలీసులు అరెస్టు చేసిన నిందితుల్లో ఒకడ్కెన పురోహిత్ భరత్ కుమార్‌పై హైదరాబాద్‌లో గతంలో మూడు కేసులు నమోదు కాగా, మరో ఇద్దరు నిందితులు పొనమారం చౌదరీ, కాంతిలాల్‌పై కెయూసి,హన్మకొండ పోలీస్‌స్టేషన్ల పరిధిలో గతలో ఒకటి చోప్పున కేసులు నమోదు అయినట్లు డిసిపి తెలిపారు. నిందితులు ప్రఖ్యాత కంపెనీల నకిలీ ఉత్పత్తులను తయారు చేసి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు పంపిణీ చేస్తున్నారని, నకిలీ ఉత్పత్తులను గుర్తించడం ప్రజలకు కష్టమవుతుందని, ఈ విషయంలో ప్రజలు ఎలక్ట్రికల్ గృహోపకరణ ఉత్పత్తులను అధికారిక అవుట్‌లెట్‌లలో మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కబరిచిన వరంగల్ ఏ. ఎస్పీ శుభం,టాస్క్‌ఫోర్స్ ఏసిపి మధుసూధన్, హన్మకొండ ఏసిపి నర్సింహరావు, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు, కేయూసి, మట్టేవాడ, హన్మకొండ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, గోపి, శివకుమార్, ఎఎఓ సల్మాన్ పాషా, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ఆర్.ఎస్.ఐ భానుప్రకాశ్, ఏ.ఎస్.ఐలు రాజేశ్వరీ, ఉప్పలయ్య, కానిస్టేబుళ్లు సురేష్, సురేందర్, సాంబరాజులను డీసీపీ అభినందించారు.

# బిఆర్ఎస్వి కాలేజ్ కమిటీ ఎన్నిక



**వేద న్యూస్,శాయంపేట:**

ఈనెల 21న హైదరాబాద్ లో జరగబోయే బిఆర్ఎస్వి శిక్షణ తరగతుల కార్యక్రమంలో భాగంగా బిఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు కొమ్ముల శివ ఆధ్వర్యంలో శాయంపేట మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల కమిటీ నీ ఎన్నుకోవడం జరిగింది .అధ్యక్షునిగా భోగి అభిలాష్ ,ప్రధాన కార్యదర్శిగా బండారి సిద్దు ,గౌరవాధ్యక్షులుగా పెద్దిరెడ్డి సాయిరాం రెడ్డి ,ఉపాధ్యక్షులుగా గడ్డి ఓమేష్ ,కార్యదర్శిగా రాయిశెట్టి శివకుమార్ ,మహిళా అధ్యక్షురాలిగా ఎండి సానియా ,ప్రధాన కార్యదర్శిగా ఎస్ కే సానియా, ఉపాధ్యక్షులుగా దార హారిక ,కార్యవర్గ సభ్యులుగా మార్త నాగచరన్ ,చల్ల సిద్దార్థ్ ,లోకల బోయిన భరత్ ,బూర వరుణ్, గడ్డబోయిన మహేందర్ ,బాసాని విగ్నేష్ ,దిండిగాల సాయిచరణ్ ,తాటికొండ సోమిత్, చింతం అక్షయ, డి అర్చన, ఎస్ నిఖిల తదితరులను ఎన్నుకోవడం జరిగిందని వారు తెలిపారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు కొమ్ముల శివ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తుందని రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం సిగ్గుచేటు అని వారు అన్నారు.వెంటనే విద్యాశాఖ మంత్రి నియమించి విద్య పాలన కొనసాగించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు కూతాటి రమేష్, బిఆర్ఎస్ యువజన విభాగం జిల్లా నాయకులు పెద్దిరెడ్డి కృష్ణారెడ్డి ,బిఆర్ఎస్వి మండల నాయకులు కోలా లక్ష్మణ్ ,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిస్తాం

- రాష్ట్ర మంత్రి సీతక్క

**వేద న్యూస్, ములుగు :**



రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం చేసేందుకు ప్రజా ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. శుక్రవారం తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ (టిఎస్ జెయు) ఆధ్వర్యంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో టిఎస్ జెయు రాష్ట్ర అధ్యక్షులు పురుషోత్తం నారగౌని, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్, ఎన్ యుజె (ఐ) జాతీయ కార్యదర్శి మెరుగు చంద్రమోహన్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీలు పావుశెట్టి శ్రీనివాస్, నాగపురి నాగరాజ్, ములుగు జిల్లా అధ్యక్షులు చల్లగురుగుల రాజు, ప్రధాన కార్యదర్శి సంఘ రంజిత్ కుమార్, ఉపాధ్యక్షులు నాగపురి హరినాథ్ గౌడ్, వరంగల్ జిల్లా అధ్యక్షులు కందికొండ మోహన్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు రాము, ప్రధాన కార్యదర్శి హరికృష్ణ, జాయింట్ సెక్రెటరీ దాడి బిక్షపతి, జనగాం జిల్లా అధ్యక్షుడు యు. నరేందర్, మహబూబ్ బాద్ జిల్లా అధ్యక్షులు ఉదయ్ ధీర్, కార్యదర్శి సతీష్ చారి, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సంతోష్, కార్యదర్శి దొమ్మాటి రవి, ఉపాధ్యక్షులు బండారి రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా సమావేశం ములుగులో జరిగింది. టిఎస్ జెయు రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మాట్ల సంపత్, కార్యవర్గ సభ్యులుగా గంద్రాతి విజయాకర్, టిఎస్ జెయు మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తాటికొండ రజిని, ఉపాధ్యక్షురాలుగా పోచంపల్లి రజిత లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా యూనియన్ సభ్యులు చల్లూరు మహేందర్, పెండం బిక్షపతి, ధనుంజయ్, రాము తదితరులు పాల్గొన్నారు.

### శ్రీ హరిశ్చంద్ర సొసైటీ

# కమిటీ నియామకం

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**



శ్రీ హరిశ్చంద్ర శవదహన, బరేల్ కార్మిక సొసైటీ గాంధీనగర్ మిర్యాలగూడ వారి ఆధ్వర్యంలో ఐదు భాగముల భాగస్తులు అందరూ కలిసి నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది.ఈ కమిటీకి గౌరవ అధ్యక్షులుగా ఉబ్బపల్లి మధుసూదన్, దైద సోమ సుందరంలను నియమించారు.అధ్యక్షులుగా ఉబ్బపల్లి గోపి,ఉపాధ్యక్షులుగా దైద మల్లేష్,ప్రధాన కార్యదర్శిగా ఏడుకొండలు,సహాయ కార్యదర్శిగా ఎల్లయ్య, కోశాధికారిగా కొండల్‌ను ఎన్నుకోవడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొసైటీ మొత్తం మాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా సొసైటీ అభివృద్ధికి సక్రమంగా పనిచేస్తామని తెలిపారు.

# నారాయణ పాఠశాలలో ఘనంగా బోనాల పండుగ

**వేద న్యూస్, మడికొండ :**

గ్రేటర్ వరంగల్ కాజీపేటలోని నారాయణ పాఠశాలలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో పాఠశాలల జోనల్ డిజిఎం రిజ్వాన ఇమ్రాన్ ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఏట ఆషాఢ మాసంలో వచ్చే బోనాల పండుగ తెలంగాణ సంస్కృతికి నిదర్శనమని, బోనాల చరిత్ర 18 వ శతాబ్దం నాటిదని, స్థానిక కథనాల ప్రకారం 1813లో సికింద్రాబాద్‌లో ప్లేగు వ్యాధి వ్యాపించినప్పుడు, ప్రజలు ఉజ్జయిని మహంకాళి దేవిని ప్రార్థించారని, ఆ తర్వాత ఈ వ్యాధి తగ్గిందని, ప్రజల విశ్వాసమని అప్పటి నుండి ఈ పండుగను తెలంగాణ రాష్ట్రంలో జరుపుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఆర్.ఐ. ములుపోజు శ్రీనివాసాచారి, జోనల్ కో. ఆర్డినేట్‌లు ఆకుల సాయి కృష్ణ, శ్యామల, శిరీష, పాఠశాల ప్రిన్సిపాల్ తేజావత్ అనిత, వైస్ ప్రిన్సిపాల్ అనూష, మౌనిక, సాఫ్ట్ స్కిల్ ఉపాధ్యాయురాలు పోగుల వీణ కుమారి, ఏవో. గుంపుల చేరాలు, పి.ఇ.టి. ఘనశ్యాం, ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



### బీసీలకు ప్రత్యేక రక్షణ

# చట్టం తీసుకురావాలి

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి**

రోజురోజుకు బీసీల పైన దాడులు మితిమీరిపోతున్నాయని ఇప్పుడిప్పుడే రాజకీయంగా,ఆర్థికంగా ఎదుగుతున్న బీసీ కుటుంబాలకు చెందిన వారిని చూసి ఓర్వలేక కొంతమంది అగ్రకులాల వారు బీసీల పైన దాడులకు పాల్పడుతున్నారని బీసీలకు రక్షణ చట్టం అత్యవసరమని, బీసీలకు రక్షణ చట్టం తీసుకురావాల్సిన అవసరం ఉందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు రోజుల క్రితం బీసీ బిడ్డ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చానల్ కార్యాలయం పై దాడి చేసి అనంతరం అతనిపై హత్య ప్రయత్నం చేశారని,అది మరవక ముందే మల్కాజ్ గిరి నియోజకవర్గానికి చెందిన కార్పొరేటర్ భర్త రాము యాదవ్ పై కొంతమంది దుండగులు దాడి చేసి గాయపరిచారని ఆవేదన వ్యక్తం చేశారు.

# బీఆర్ఎస్ పార్టీ నాయకులకు పరామర్శ



**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

మిర్యాలగూడ పట్టణంలోని 13వ వార్డు ,29 వ వార్డు మూడో వార్డు, రెండవ వార్డుకు చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులను మిర్యాలగూడ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు నల్లమోతు సిద్ధార్థ వారి స్వగృహాలకు వెళ్లి వారి ఆరోగ్య యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.మన పార్టీ ఎప్పుడూ మీకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.వారి వెంట ఎడవెల్లి శ్రీనివాసరెడ్డి, పిన్నబోయిన శ్రీనివాస్ యాదవ్, తిరుమలగిరి వజ్రం,గుడిసె దుర్గ ప్రసాద్ ,లింగంపల్లి చిరంజీవి, దోనేటి సైదులు,షేక్ మస్తాన్, అన్నపర్తి గంగాధర్,షేక్ నాగులు తో పాటు బీఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# అశోక్‌ను పరామర్శించిన చైర్మన్




**వేద న్యూస్, సూర్యాపేట ప్రత్యేక ప్రతినిధి :**

ఆమనగల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత గౌరోజు అశోక్ ఇటీవల ఆరోగ్యం విసమించటంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న సల్కునూరు సహకార సంఘం చైర్మన్ గడ్డం స్వార్ధర్ రెడ్డి ఆస్పత్రికి చేరుకొని అశోక్ ను పరామర్శించారు. అనంతరం ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అన్ని విధాలుగా ఆదుకుంటానని భరోసా కల్పించారు.ఆయన వెంట బిఆర్ ఎస్ జిల్లా నాయకులు చౌక్కా రావు, సీనియర్ జర్నలిస్ట్ వంగాల వెంకటేష్, పల్ల బిక్షం, ఎలగపల్లి నరేష్, రాగి నరేష్, సంతోష్ శ్రీను ఉన్నారు.

### పుట్టిన రోజు సందర్భంగా కేసీఆర్

# ఆశీస్సులు తీసుకున్న జగదీశ్ రెడ్డి

**వేద న్యూస్,హైదరాబాద్ :**



మాజీ మంత్రివర్యులు, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా జగదీశ్ రెడ్డి కేసీఆర్ ఆశీస్సులు తీసుకున్నారు.

# మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

**- రాష్ట్ర మంత్రి కొండా సురేఖ**

**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**




రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఇందిరమ్మ కళలను నెరవేర్చడానికి పలు పథకాలను అమలు చేయడం జరుగుతుందని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ తెలిపారు. శుక్రవారం వరంగల్ తూర్పు నియోజకవర్గం ఎల్బీనగర్ లోని ఏ వన్ ఫంక్షన్ హాల్ లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 100 రోజుల కార్యక్రమాల్లో భాగంగా బల్దియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిధిగా పాల్గొని, నగర మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదతో కలసి కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గ లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు, స్వయం సహాయక మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, బ్యాంకు లింకేజీ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ మహిళా జీవితాల్లో వచ్చిన మార్పును గుర్తు చేసుకుంటూ సంబురాలు చేసుకునేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసుకున్నామని మంత్రి సురేఖ తెలిపారు. గత పాలకుల హాయంలో నిర్లక్ష్యం చేసిన వడ్డీ లేని రుణాలను ప్రజా ప్రభుత్వంలో పునరుద్ధరించామని అన్నారు. మహిళలను కోటీశ్వరులు చేయాలని లక్ష్యంతో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. పేద కుటుంబాలకు రాష్ట్రంలో సన్నబియ్యం రేషన్ కార్డు ద్వారా సరఫరా చేస్తున్నామని 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని తెలిపారు. గత బీఆర్ఎస్ పార్టీ 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న ఏ ఒక్కరికి కూడా రేషన్ కార్డు ఇచ్చిన దాఖలాలు లేవని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందజేయడం జరుగుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఆర్థికంగా అనేక కష్టాలు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని మంత్రి కొండ సురేఖ తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా ప్రభుత్వం అమలు చేస్తుందని ఈ సందర్భంగా తెలియజేశారు.



## ఘనంగా మాజీ మంత్రి జన్మదిన వేడుకలు

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

మిర్యాలగూడ పట్టణంలోని రెడ్డికాలనీ లో గల బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం నందు తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి,సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి జన్మదిన వేడుకలను మిర్యాలగూడ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించుకున్నారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహ రెడ్డి భారీ కేకును కట్ చేసి భారాస ప్రజాప్రతి నిధులు,మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు,కార్యకర్తలకు కేకు తినిపించి మాజీ మంత్రి జగదీష్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగదీష్ రెడ్డి నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో,సుఖ సంతోషాలతో చిరకాలం ప్రజాసేవలో కొనసాగాలని మనస్ఫూర్తిగా అకాంక్షిస్తున్నామని తెలిపారు.

## సమస్యలపై స్పందించిన ధర్మయ్య



**వేద న్యూస్,బోయినపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం అనంత పల్లి గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు స్కూలులో నీటి సమస్య ఉందని తెలుసుకున్న బోయినిపల్లి మండల కాంగ్రెస్ కార్యదర్శి హల్వాల ధర్మయ్య ఈరోజు స్కూలుకు వెళ్లి సమస్యలు చూసి వాటిని పరిష్కరిస్తానని చెప్పడం జరిగింది. బోరు నుండి నీరు ట్యాంకు పైకి వెళ్లే పైపులైన్స్ పగిలిపోవడం ముఖ్యంగా వంటగదిలో కరెంటు వైర్లు తెగిపోయి ప్రమాదకరంగా ఉండడంతో విద్యార్థులకు ఏదైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని తెలుసుకుని పరిస్థితి చూసి సమస్యలు రెండు మూడు రోజుల్లో పరిష్కరిస్తానని కాంగ్రెస్ మండల కార్యదర్శి అల్వాల ధర్మయ్య హామీ ఇచ్చారు.అంతేకాకుండా ఏదైనా పెద్ద సమస్య ఉంటే చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కారం అయ్యేలా కృషి చేస్తామని తెలిపారు.

## పందుల స్వైర విహారం



**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

వర్షాకాలం మొదలైంది..అసలే దోమల బెడద ఎక్కువగా ఉందనుకుంటే ఇప్పుడు మిర్యాలగూడ పట్టణంలో పలు వీధులలో పందుల స్వైర విహారం చేస్తున్నాయి. మిర్యాలగూడ పట్టణంలో పలు వార్డులలో దోమల బెడద ఎక్కువగా ఉందని ముఖ్యంగా 47 వ వార్డు పరిసరాలలో దోమలతో పాటు పందులు గుంపులు గుంపులుగా స్వైర విహారం చేస్తూ దారిన వచ్చిపోయే ద్విచక్ర వాహనాలకు తగులుతూ ప్రమాదాలకు అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే వార్డులో 500 వందల గడపలు ఉన్నాయని, ప్రతి వీధిలో పందులు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయని,ఇక్కడ పరిసర ప్రాంతాలలో కాలేజీలు,స్కూలు ,డాక్టర్స్ కాలనీ ఉన్నందున ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని పందులను అరికట్టవలసిందిగా, మలేరియా,డెంగ్యూ,మెదడు వాపు వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వార్డు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మహమ్మద్ అబ్దుల్ హలీం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది.

## చర్చ్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేసిన

# విష్ణువర్ధన్

**వేద న్యూస్, హన్మకొండ:**

కాజీపేట క్రిస్టియన్ ఫెలోషిప్ చర్చి ప్రత్యేక ప్రార్థనల్లో యువ నాయకుడు విష్ణు వర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. శుక్రవారం కాజీపేట్ చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలకు పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అల్లుడు విష్ణు వర్ధన్ రెడ్డి హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పశ్చిమ నియోజకవర్గం యువత విష్ణు వర్ధన్ రెడ్డిని పూల మాల శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చర్చ్ నిర్వాహకులు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్‌ల ఉసురు పాలకులకు తగులుతుంది



**వేద న్యూస్, చొప్పదండి /రామడుగు :**

గ్రామాల్లో కనీస మౌలిక వసతులు లేకపోతే నమ్ముకున్న ప్రజలు చీదరించుకుంటారనే ఆలోచనతో కష్టాలకు ఓర్చి గ్రామాల్లో వెలుగులు నింపిన మాజీ సర్పంచ్లు నేడు చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని బీజేపీ రాష్ట్ర కార్య వర్గ సభ్యులు ప్రభాకర్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో మండల బీజేపీ అధ్యక్షుడు మోడీ రవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు ఏ పార్టీ పాలనలో ఇలాంటి వ్యవస్థ లేదని కేవలం గత ప్రస్తుత పార్టీ ల వల్లే సర్పంచ్ లకు ఈ గతి పట్టిందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తాజా మాజీ సర్పంచ్ ల సమస్యలు పరిష్కారం చేస్తామని చెప్పిన పాలకులు మాట నిలబెట్టుకోలేదనారు. ఇప్పటికైన నిధులు చెల్లించి వారి చిత్త శుద్ధి నిరూపించుకోవాలని ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కట్ట రవీందర్, ఉప్పు రామ కృష్ణ, జిట్ట వేణి అంజిబాబు, కారు పాకాల అంజయ్య, బొమ్మకంటి భాస్కర్, సంటి జితేందర్, బండ తిరుపతి రెడ్డి తదితరులున్నారు.



### నేరాల నియంత్రణలో

## సీసీ కెమెరాలు కీలకం

**- ఎస్పీ మహేష్ బి.గితే**

**వేద న్యూస్, చందుర్తి :**

చందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని క్రిష్టంపెట్ గ్రామంలో ఏర్పాటు చేసిన 9 సీసీ కెమెరాలను,పోలీస్ అధికారులు గ్రామ ప్రజలు,ప్రజాప్రదినిధులతో కలసి ఎస్పీ మహేష్ బి.గితే ప్రారంభించారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి గ్రామస్తులు ముందుకు రావడం అభినందనీయమని మిగిలిన గ్రామ ప్రజలు కూడా స్వీయారక్షణ కోసం గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని జిల్లా ఎస్పీ ప్రజలకు పిలుపునిచ్చారు.అనంతరం ఎస్పీ మాట్లాడుతూ సీసీ కెమెరాల వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని,గ్రామంలో ఏ చిన్న సంఘటన జరిగినా సీసీ కెమెరాల ద్వారా వెంటనే తెలుసుకోవచ్చని, గ్రామాల్లో సీసీ కెమెరాలు మరింత భద్రత కల్పిస్తాయని,సీసీ కెమెరాల ద్వారా ఈమధ్యకాలంలో చాలా కేసులు చేదించడం జరిగిందని తెలిపారు. కేసుల ఛేదన సమయంలో సీసీ కెమెరాలు సాక్ష్యంగా ఉపయోగపడతాయని తెలిపారు. గ్రామంలో రాత్రింబవళ్లు 24 గంటలు ప్రజలకు రక్షణగా నిలుస్తాయని,పోలీస్ స్టేషన్ పరిధిలోని సీసీ కెమెరాలు లేని గ్రామల ప్రజలు సీసీ కెమెరాలు ఏర్పాటు గురించి ముందుకు వచ్చి పోలీస్ పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు.ప్రతి ఒక్కరూ సిసి కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావడం ద్వారా నేర రహిత సమాజ నిర్మాణం సాధ్యమని ఆయన చెప్పారు.

## ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



**వేద న్యూస్, కరీంనగర్ :**

స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా నగరవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 769 సీసీటీవీ కెమెరాలు జూన్ 27, 2025 నుండి పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయని, వీటి ద్వారా ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలను గుర్తించి చలాన్లు జారీ చేస్తున్నట్లు కరీంనగర్ పోలీస్ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో వాహన రాకపోకలను పర్యవేక్షించడంతోపాటు, రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ఈవ్యవస్థ ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు.సీసీటీవీల పర్యవేక్షణలో

**గుర్తించబడే ప్రధాన ట్రాఫిక్ ఉల్లంఘనలు:**

1) ట్రాఫిక్ సిగ్నల్ జంపింగ్
2) హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడపడం
3) సీట్ బెల్ట్ లేకుండా కారు నడక
4) వ్యతిరేక దిశలో రాంగ్ రూట్

డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగంట్రిపుల్ రైడింగ్అతివేగం/ ర్యాష్ డ్రైవింగ్ పైన పేర్కొన్న నిబంధనల్లో ఏదైనా ఉల్లంఘించినవారిపై తక్షణమే చలాన్లు జారీ చేయబడతాయని, ప్రజలు ట్రాఫిక్ నియమాలను పక్కాగా పాటించాలని కమీషనర్ విజ్ఞప్తి చేశారు.జూన్ 27 నుంచి జూలై 17 వరకూ నమోదైన గణాంకాలు:మొత్తం ఉల్లంఘనల సంఖ్య 13,869 కేసులు ఆదాయంగా వచ్చిన మొత్తం జరిమానా: రూ. 1,13,43,400 ఉల్లంఘన రకం కేసులుజరిమానా మొత్తం ట్రిపుల్ రైడింగ్ రూ. 8, 808 1,05,69,600సీట్ బెల్ట్ లేకుండా డ్రైవింగ్ 3, 4373,43,700 సెల్‌ఫోన్ వాడుతూ డ్రైవింగ్ 2512, 51,000 రాంగ్ రూట్ డ్రైవింగ్ 41883, 600హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ (జూన్ 27) 95595,500 ప్రస్తుతం హెల్మెట్ మరియు అతివేగం డ్రైవింగ్‌పై చలాన్లు తాత్కాలికంగా అమలులో లేనప్పటికీ, ఇతర శాఖల సమన్వయంతో త్వరలో వాటిపై కూడా చర్యలు చేపడతామని కమీషనర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ యాద గిరి స్వామి, ఇన్‌స్పెక్టర్లు ఖరీముల్లా ఖాన్, రమేష్, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ట్రాఫిక్ నియమాలపై ప్రజల్లో అవగాహన పెంచడంతోపాటు, శాస్త్రీయ పద్ధతు ల్లో ప్రయాణ సంస్కృతిని పెంపొందించేందుకు పోలీసులు కృషి చేస్తున్నారని వారు పేర్కొన్నారు. కరీంనగర్ ప్రజలందరూ ట్రాఫిక్ నియమాలను గౌరవిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు.

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్..

**వేద న్యూస్,ఛత్తీస్‌గఢ్ :**

ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్ జిల్లాలో మావోయిస్టులకు, భద్రతాబలగాలకు మధ్య ఎదురుకాల్పులు జరుగుతున్నాయి. ఈ కాల్పుల్లో ఇప్పటికే ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. సంబంధిత పోలీస్ అధికారులు ఈ విషయాన్ని మీడియాకు వెల్లడించారు.అంబూజ్‌మడ్ రీజియన్‌లోని అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కదలికలు ఉన్నాయని సమాచారం అందడంతో శుక్రవారం ఛత్తీస్‌గఢ్ పోలీసులు, భద్రతాబలగాలు కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ సందర్భంగా మధ్యాహ్నం మావోయి స్టులు తారసపడటంతో ఇరువర్గాల మధ్య ఎదురు కాల్పులు మొదలయ్యాయి.ఈ కాల్పుల్లో ఇప్పటివరకు ఆరుగురు మావోయి స్టులు మరణించారు. కాల్పులు ఇంకా కొనసాగుతున్నాయి.

## పరిష్కరించాలని చూస్తే.. తప్పుపడతారా..?

**వేద న్యూస్,జనగామ :**

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ జలవివాదంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఏపీ, తెలంగాణ జల వివాదం పరిష్కంచాలని ప్రయత్నిస్తే తప్పుపడుతున్నారని మండిపడ్డారు. నీటి విషయంలో రెండు రాష్ట్రాల ప్రయోజనాలు కాపాడతామని స్పష్టం చేశారు. ఈ సమస్యను జల వివాదం కమిటీ పరిష్కరిస్తుందని చెప్పుకొచ్చారు. నీటికి సంబంధించి తెలంగాణకు అన్యాయం జరగనివ్వమని వెల్లడించారు. బీఆర్ఎస్ వాళ్లు మళ్లీ తెలంగాణ వాదాన్ని రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. అప్పుడు కిషన్ రెడ్డి ఫోన్ ట్యాప్ చేశారని.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నట్టు అనుమానం వస్తోందని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్‌తో కేసీఆర్ జల్సాలు చేశారని విరుచుకుపడ్డారు బండి సంజయ్. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటే అంటూ వ్యాఖ్యలు చేశారు. 'తెలంగాణలో ఏ గ్రామానికైనా వస్తా. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలో అభివృద్ధిపై చర్చిద్దామా?. ఇందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ సిద్ధమా?' అంటూ సవాల్ విసిరారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలో ప్రజలు విసిగిపోయారన్నారు. రెండు పార్టీల నేతలు తిట్టుకోవడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. కాంగ్రెస్ నేతలను ప్రజలు నిలదీస్తున్నారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ ఎక్కువ స్థానాలు గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలే తమ ప్రచార కర్తలని తెలిపారు. గ్రామపంచాయతీ సిబ్బందికి జీతాలు ఇవ్వడం లేదని.. గ్రామీణ వ్యవస్థ సర్వనాశనం అవుతోందని అన్నారు. తెలంగాణ ప్రజల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్టైందంటూ వ్యాఖ్యలు చేశారు కేంద్రమంత్రి. తెలంగాణకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి రేపు (శనివారం) వస్తున్నారని, వ్యాగన్ ఫ్యాక్టరీని ప్రారంభిస్తారని తెలిపారు. అన్ని స్కామ్‌లు పక్కకు పోయాయని.. ఏ ఒక్క స్కామ్‌లోనూ కేసీఆర్ కుటుంబాన్ని ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నించారు. రెండు పార్టీలు ఒక్కటే అని.. 'నువ్వు కొట్టినట్టు చెయ్ నేను ఏడ్చినట్టు చేస్తా' అనే ధోరణిలో ఉన్నారంటూ కేంద్రమంత్రి బండి వ్యాఖ్యలు చేశారు. మరోవైపు బీసీలకు రేవంత్ సర్కార్ అన్యాయం చేస్తోందని ఆరోపించారు. 42 శాతంలో 10 శాతం ముస్లింలే ఉన్నారని.. ఇప్పటికే ఉన్న 23 శాతంలో అదనంగా ఇచ్చేది ఐదు శాతమే అని అన్నారు. బీసీలకు వైఎస్ రాజశేఖర్ రెడ్డి తీవ్ర అన్యాయం చేశారని మండిపడ్డారు. ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించడంతో ప్రజాప్రతినిధులు కావాల్సిన బీసీల స్థానాల్లో ఎంఐఎం వాళ్లు అయ్యారన్నారు. ఇప్పుడు జనాభా దామాషా ప్రకారం బీసీలకు మాత్రమే 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని.. దాంట్లో

వేద న్యూస్

శనివారం జులై 19, 2025

### ఇందిరా మహిళ శక్తితో..

# ఫర్టిలైజర్ దుకాణాలు ఏర్పాటు



**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట :**

మహిళలు వ్యాపారంలోనూ రాణించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఆకాంక్షించారు. ఇందిరా మహిళా సంబరాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, జిల్లాలోని ముస్తాబాద్, మండలం ఆవునూరు, గాయత్రి గ్రామైక్య సంఘం, ఎల్లారెడ్డిపేటలో చైతన్య గ్రామైక్య సంఘం, కోరుట్లపేటలో భాగ్య శ్రీ గ్రామైక్య సంఘం, ఆధ్వర్యంలో ఎరువులు పురుగు మందుల దుకాణాలను ఏర్పాటు చేసి శుక్రవారం వాటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం మేరకు ఇందిరా మహిళ శక్తి కింద జిల్లాలోని మహిళా సంఘాలకు ఇప్పటికే క్యాంటీన్లు, డైరీ యూనిట్, కోడి పిల్లల పెంపకం, ఆర్టీసీ బస్సులు ఇతర స్వయం ఉపాధి యూనిట్లను అందజేశామని తెలిపారు. త్వరలో రైస్ మిల్లులు, పెట్రోల్ బంక్, సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. రైతన్నలకు ఉత్తమ సేవలు అందించేలా మహిళా సంఘాలకు ఎరువులు, పురుగు మందుల దుకాణాలు ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించామని తెలిపారు. జిల్లాలో మొత్తం 23 దుకాణాలు మహిళా సంఘాల ఆధ్వర్యలో ఏర్పాటు చేయనున్నామని, ఇందులో భాగంగా ముందుగా 3, ప్రారంభించామని, ఎరువులు, పురుగు మందుల దుకాణాలు ఏర్పాటు రాష్ట్రంలోనే ప్రథమముని వెల్లడించారు. మహిళా సంఘాల బాధ్యులు ప్రణాళిక ప్రకారం నిర్వహించి రైతులకు ఉత్తమ సేవలు అందించాలని నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులు తమ పరిధిలోని మహిళా సంఘాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో ఎరువులు విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేసి మహిళలకు ఆర్థికంగా మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. మహిళా సంఘాల బాధ్యులు ఐక్యంగా తమ దుకాణాలను సమర్థవంతంగా నిర్వహించి ఆర్థికంగా మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.



## నగరవాసులకు హైడ్రా హెచ్చరిక

**వేద న్యూస్, హైదరాబాద్ :**

హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో కుండపోత వర్షం కురుస్తోంది. జూబ్లీహిల్స్, ఫిల్మ్ నగర్, మెహదీపట్నం, మణికొండ, టోలిచౌకి, షేక్‌పేట్, గోల్కొండ, అత్తాపూర్, లంగర్‌హౌస్, బంజారాహిల్స్, తార్నాక, ఓయూ, నాచారం, మల్లాపూర్, హబ్సిగూడ, కూకట్‌పల్లి, కేపీహెచ్బీ, నిజాంపేట్, మియాపూర్, మూసాపేట్ సహా బాలానగర్, సనత్‌నగర్, ఎర్రగడ్డలో భారీ వర్షం కురుస్తోంది. అలాగే మాదాపూర్, హైటెక్ సిటీ, కొండాపూర్, శేరిలింగంపల్లి, హకీంపేట్, కంటోన్మెంట్, ఖైరతాబాద్‌లోనూ భారీగా వర్షం పడుతోంది. ఆయా ప్రాంతాల్లో జనం అవస్థలు పడుతున్నారు. మరోవైపు వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. లోతట్టు ప్రాంతాల్లో ఎక్కడికక్కడ ట్రాఫిక్ నిలిచిపోగా.. పలువురు మెట్రో పిల్లర్ల కింద తలదాచుకున్నారు. కాగా, వర్షం నేపథ్యంలో అధికారులను జీహెచ్ఎంసీ అప్రమత్తం చేసింది. వర్షం తగ్గేంత వరకూ ఇళ్ల నుంచి బయటకు రావొద్దని ప్రజలకు సూచనలు చేసింది. ఇలా ఉండగా, తెలంగాణలో రెండు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. రేపు (శనివారం) వరకూ తెలంగాణవ్యాప్తంగా పలు జిల్లాల్లో వానలు కురవనున్నట్లు వెల్లడించింది. హైదరాబాద్, జయశంకర్ భూపాలపల్లి, మేడ్చల్ మల్కాజిగిరి, ములుగు, కరీంనగర్, మహబూబ్ నగర్, సంగారెడ్డి, సిద్దిపేట, వికారాబాద్, నాగర్ కర్నూల్, పెద్దపల్లి, రంగారెడ్డి వరంగల్, హనుమకొండ జిల్లాలకు భారీ వర్ష సూచన చేసింది. ఆయా జిల్లాల్లో గంటకు 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

### బాసర అమ్మవారిని

## దర్శించుకున్న మంత్రి

మొదటిపేజీ తరువాయి

సన్నిధికి వచ్చిన మంత్రికి ఆలయ అర్చకులు, అధికారులు వేద మంత్రోచ్చారణల నడుమ పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం అర్చకులు మంత్రికి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అలాగే మహంకాళి, దత్తాత్రేయ స్వామిని మంత్రి దర్శించుకున్నారు. అనంతరం వసతి గృహంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మంత్రికి నిర్మల్ పెయింటింగ్స్ చిత్రపటం బహూకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వం అన్ని ఆలయాలను దశలవారీగా అభివృద్ధి చేస్తోందని, బాసర నూతన ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. మాస్టర్ ప్లాన్ అమలుపై ముఖ్యమంత్రి, దేవాదాయ శాఖ మంత్రితో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీవో కోమల్ రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు ప్రవీణ్ పాఠక్, ఈవో సుదర్శన్ రెడ్డి, దేవాదాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# నీ మనువడి మీద ఒట్టేసి చెప్పు..?

**వేద న్యూస్, ఖమ్మం :**

తన సీఎం సీటుకు ఎసరు పెడుతారనే భయంతో ముగ్గురు మంత్రుల ఫోన్లను రేవంత్ రెడ్డి ట్యాప్ చేయిస్తున్నాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ ముగ్గురు మంత్రుల ఫోన్లు ట్యాప్ చేయడం లేదాని నీ మనువడి మీద ఒట్టేసి చెప్పే ధైర్యం ఉందా..? అని కేటీఆర్ నిలదీశారు. ఖమ్మం జిల్లాలో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. దమ్ముంటే, మగాడివి అయితే చెప్పు. నీ సీటుకు ఎవడు ఎసరు పెడుతాడో అని చెప్పి ఇవాళ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, అదే విధంగా రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫోన్లు నువ్వు ట్యాప్ చేయడం లేదా..? బయటకొచ్చి నేను వీళ్ల ఫోన్లు ట్యాప్ చేయట్లేదని నీ మనువడి మీద ఒట్టేసి చెప్తావా..? అని రేవంత్‌ను కేటీఆర్ నిలదీశారు. రాష్ట్రంలో వేలాది మంది ఫోన్లు ట్యాప్ చేస్తున్న మాట వాస్తవం కాదా..? లై డిటెక్టర్ ముందు కూర్చుని చెప్తావా..?



మగాడివి అయితే రా. దమ్ముంటే బయటకొచ్చి ఒట్టేసి చెప్పు. చేసేది గలీజ్ పనులు.. మీదికెళ్లి పెద్ద పెద్ద మాటలు. ఓ గల్లీ రౌడీలాగా ఢిల్లీకి పోయి సిల్లీ మాటలు మాట్లాడిన ముఖ్యమంత్రికి ఒక్కటే చెప్తున్నా.. ఇప్పటికి 50 సార్లు ఢిల్లీకి పోయావు.. 50 పైసలు అయినా వచ్చాయా..? ఢిల్లీకి పోవడం చీకట్లో మోదీ, అమిత్ షా కాళ్లు పట్టుకోవడం. రాహుల్ గాంధీ ఏమో నిన్ను దేకట్లేదు. అపాయింట్‌మెంట్ ఇస్తలేడు అని కేటీఆర్ పేర్కొన్నారు. నేను సవాల్ స్వీకరిస్తున్నా.. చర్చకు రమ్మంటే పారిపోయావు. మళ్లీ నన్ను అంటడు పారిపోయానని. కానీ పారిపోయి ఢిల్లీలో దాక్కున్నది నువ్వు. సొంత ఛాలెంజ్‌ను కూడా స్వీకరించలేదు నువ్వు. ఎప్పుడంటే ఎప్పుడు.. ఎక్కడంటే ఎక్కడ చర్చకు రెడీ. హామీలు అమలు చేయలేవు.. ఆ దమ్ము లేదు. పనికిమాలిన వితండవాదాన్ని ప్రజలు పట్టించుకోకండి. నికృష్ట రాజకీయాన్ని తప్పకుండా నిలదీయాలి. రానున్న రోజుల్లో గల్లా పట్టి అడగాలి అని కేటీఆర్ ప్రజలకు పిలుపునిచ్చారు.

### కేసీఆర్ వల్లే పాలమూరు

# ప్రాజెక్టు పూర్తి కాలే!

**వేద న్యూస్,నాగర్ కర్నూల్:**



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలమూరు–రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పూర్తి చేయడంలో తన నిబద్ధతను ప్రకటించారు. ఈ ప్రాజెక్టుతోపాటు దిండి, కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ వంటి కీలక ప్రాజెక్టులను అడ్డుకునే ప్రయత్నాలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ రద్దు చేసుకోవాలని, అందుకు సహకరించాలని సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు. సహకారం లేకపోతే పోరాటం తప్పదని అన్నారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేయడం తన బాధ్యత అంటూ స్పష్టం చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం జటప్రోలులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కు రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. అంతేకాదు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ని ఉద్దేశిస్తూ 'నీ గుండె, నీ కుమారుడి గుండె మీద కూడా రాసుకో.. మరో పదేళ్లు నేనే సీఎంగా ఉంటా' అని రేవంత్ పేర్కొన్నారు. ఈ పాలమూరు బిడ్డే తెలంగాణను ప్రజా ప్రభుత్వంతో నడిపిస్తాడని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్‌ను అసెంబ్లీకి రావాలని, ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను చూసి నేర్చుకోవాలని హితబోధ చేశారు రేవంత్. 'నీకు దుఃఖమొస్తే ఏడ్చినా, బావిలో దూకినా, నీ ఇష్టం' కానీ తెలంగాణ ప్రజల కోసం తాము చేసే మంచి పనులను చూస్తూ ఉండాలని రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే పాలమూరు ప్రాంతం సస్యశ్యామలంగా మారి, రైతుల జీవనోపాధికి బలమైన ఆధారంగా నిలుస్తాయని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. జబనాగర్‌కర్నూల్ జిల్లా జటప్రోలులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా పాలమూరు ప్రాంత అభివృద్ధికి కొత్త ఊపిరి లభించింది. ఈ సందర్భంగా రూ.200 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన జరిగింది. ఈ స్కూల్ విద్యార్థులకు ఆధునిక విద్య, సౌకర్యాలతో ఉజ్వల భవిష్యత్తును అందించనుంది. ఈ సందర్భంగా కొల్లాపూర్ అభివృద్ధికి అవసరమైన నిధులను పూర్తిగా అందిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. గతంలో కేసీఆర్ నాయకత్వంలో పాలమూరు పట్ల నిర్లక్ష్యం జరిగిందని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. పదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్.. పాలమూరు ప్రజల సమస్యలను ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. వరద బాధితులకు ఇళ్లు కట్టిస్తానని చెప్పిన కేసీఆర్.. ఆ హామీని ఎందుకు నెరవేర్చలేదన్నారు. రూ.25వేల కోట్లు ఖర్చు చేసి ఉంటే పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ఇప్పటికే పూర్తయ్యేదన్నారు రేవంత్. అదే సమయంలో రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కేవలం మూడేళ్లలో కూలేశ్వరంగా మారిందని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్, పాలమూరు ప్రాజెక్టులను రెండేళ్లలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే రూ.21వేల కోట్ల రైతు రుణమాఫీ చేసినట్లు సీఎం రేవంత్ తెలిపారు. 9 రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులు విడుదల చేశామని, వరి పండించిన రైతులకు బోనస్ కూడా ఇస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరెంటు ఉండదని కొందరు అన్నారని, కానీ తాము 24 గంటలూ ఉచిత కరెంటు ఇస్తున్నామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలపై శ్వేతపత్రం విడుదల చేయాలి..

**వేద న్యూస్, హైదరాబాద్**

హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నాయకులు ముఠా గోపాల్, తక్కెళ్లపల్లి రవీందర్ రావు, నవీన్ కుమార్ రెడ్డితో కలిసి మధుసూదనాచారి మీడియాతో మాట్లాడారు. రేవంత్ రెడ్డి పరిపాలన చేస్తున్నారా.. ఢిల్లీ పెద్దలను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారో అర్థం కావడం లేదని విమర్శించారు. ఢిల్లీ పర్యటనలపై సీఎం రేవంత్ రెడ్డి శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనల వల్ల వచ్చిన లాభం ఏంటో ప్రజలకు తెలియజేయాలన్నారు. రాష్ట్ర ప్రజలను బలి ఇవ్వడానికే సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలు చేస్తున్నారని మధుసూదనాచారి ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రజలను మోసం, దగా చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి అయ్యాక దాదాపు 200 రోజులు ఢిల్లీ, విదేశీ పర్యటనలకు వెళ్లారని అన్నారు. రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్తే బొంకులు, హైదరాబాద్‌లో ఉంటే రంకులు అని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి తన ఇంటి నుంచి లేదా కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి మాత్రమే పాలన ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. లోపాయికారీ వ్యవహారాలు చక్కబెట్టుకునేందుకు ఇంటినుంచి, హిడెన్ అజెండాతో కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పాలన చేస్తున్నారని అన్నారు. ఎక్కడా అప్పు పుట్టడం లేదని, దొంగను చూసినట్టు చూస్తున్నారని రేవంత్ రెడ్డి అంటున్నారని.. ఆయన రాష్ట్ర ప్రతిష్టను దిగజారుస్తున్నారని మధుసూదనాచారి మండిపడ్డారు. మహిళలకు ప్రతి నెల 2500 ఇస్తామని చెప్పి మాట తప్పారని అన్నారు. కల్యాణలక్ష్మీతో పాటు తులం బంగారం ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో సాగునీటికి ఇబ్బందులు తలెత్తలేదని.. ఇప్పుడు మాత్రం ఆ సమస్య ఎందుకు ఏర్పడిందని అడిగారు. రాష్ట్రంలోని అనేక ప్రభుత్వ హాస్టళ్లలో ఫుడ్ పాయిజన్ అవుతుందని.. విద్యాశాఖను తన దగ్గరే పెట్టుకున్న రేవంత్ రెడ్డి దీనిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. వీటన్నింటిపై ప్రశ్నిస్తే రేవంత్ రెడ్డి ఎదురుదాడికి దిగుతున్నారని మండిపడ్డారు. తెలంగాణ ప్రయోజనాలను రేవంత్ రెడ్డి దెబ్బతీస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి నిరుద్యోగులు ఓట్లు వేశారని.. కానీ సీఎం కాగానే వారిని రేవంత్ రెడ్డి మోసం చేశారని మధుసూదనాచారి మండిపడ్డారు. బీసీల అభివృద్ధికి సంవత్సరానికి 20వేల కోట్ల చొప్పున ఐదేళ్ల కాలంలో రాష్ట్ర బడ్జెట్‌లో పెడతామని చెప్పి.. కేవలం ఏడు వేల కోట్లు మాత్రమే పెట్టారని అన్నారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ వ్యవసాయాన్ని పండగ చేశారని.. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక విత్తనాలు, ఎరువుల కోసం రైతులు క్యూలైన్లలో ఉండే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని తిరోగమనంలోకి నెట్టారని మండిపడ్డారు .రాష్ట్రంలోని పోలీస్ స్టేషన్లు కాంగ్రెస్ కార్యాలయాలుగా పనిచేస్తున్నాయని మధుసూదన చారి అన్నారు. సోషల్‌మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారని.. బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలపై దాడికి పాల్పడుతున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని విమర్శించారు.



# ఏనుగుల మంద ట్రాక్ దాటుతుండగా ఢీకొట్టిన రైలు..

**వేద న్యూస్, డేస్క్:**

ఓ ఏనుగుల మంద రైల్వే ట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో మూడు ఏనుగులు మృతిచెందాయి. వాటిలో ఒక తల్లి ఏనుగు కాగా రెండు గున్న ఏనుగులు ఉన్నాయి. పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని బన్టోలా రైల్వేస్టేషన్ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఖరగ్‌పూర్–టాటానగర్ రైల్వే మార్గంలో ఏడు ఏనుగులతో కూడిన ఓ మంద ట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొట్టింది. ఈ ఘటనలో తల్లి ఏనుగు సహా దాని రెండు పిల్లలు అక్కడికక్కడే మరణించాయి. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకుని రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించారు. ఏనుగుల కళేబరాలను క్రేన్ సాయంతో ట్రాక్‌పై నుంచి తొలగించి రైళ్ల రాకపోకలను పునరుద్ధరించారు. కాగా రైలు ప్రమాదాల్లో ఏనుగులు మరణించడం ఇదే తొలిసారి కాదని, దేశవ్యాప్తంగా పలు



సందర్భాల్లో రైళ్లు ఢీకొట్టడంతో ఏనుగులు మృతిచెందాయని జంతు ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలని అంటున్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073